భయపెడుతున్న ఎండలు!

- వేసవి ప్రారంభంలోనే ప్రతాపం చూపుతున్న సూర్యుడు
- రోజురోజుకు పెరుగుతున్న ఉష్ణోగ్రతలు

డోన్: ఎండలు జనాన్ని భయపెడుతున్నాయి. వేసవి ప్రారంభంలోనే సూర్యుడు తన ప్రతాపాన్ని చూపుతున్నాడు. ఉదయం 9 గంటలకే సూర్యుడు భగభగమంటున్నాడు. దాదాపు 11 గంటలకు ఉక్కపోతా కూడా మొదలవుతుంది. ప్రజలు బయటకు రాలేని పరిస్థితి నెలకొంది. పట్టణంలోని ప్రధాన రోడ్లు నిర్మానుష్యంగా మారుతున్నాయి. ప్రత్యేకించి ఎప్పుడూ రద్దీగా ఉండే రైల్వేస్టేషన్ రోడ్డు జనసంచారం లేక ఖాళీగా దర్శనమిస్తుంది. అదేవిధంగా బస్టాండ్ ప్రాంతంలోనూ జనసంచారం పూర్తిగా తగ్గిపోయింది. గ్రామాల్లోనూ ఇదే పరిస్థితి. రైతులు ఉదయమే పొలాలకు వెళ్లి 11 గంటలకంతా ఇళ్లు చేరుకుంటున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మునుముందు ఏమిటనే భయం మొదలైంది. వేసం ఆరంభ దశలోనే 32 డిగ్రీల సెల్షియస్ ఉష్ణోగ్రత నమోదవుతోంది. రాబోయే మూడు నెలల్లో ఈ ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలకు పైగా చేరుకోవచ్చని పెద్దల అంచనా. గతేడాది కంటే ఈ ఏడాది ఉష్ణోగ్రతలు అధికంగా ఉండవచ్చునని వాతావరణ నిపుణులతో పాటు వైద్యులు హెచ్చరిస్తున్న నేపథ్యంలో శీతల పానియాల దుకాణాలు అక్కడక్కడ వెలుస్తున్నాయి. ప్రత్యేకించి చెరుకు రసం కేంద్రాల ఏర్పాటు యువత సిద్ధం అవుతున్నారు.



ఖాళీగా దర్శనమిస్తున్న కొత్తబస్టాండ్

వడదెబ్బ సోకే ప్రమాదం....

ఎండలు తీవ్రంగా ఉన్నప్పుడు వడదెబ్బ సోకే ప్రమాదం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. మనిషి మెదడులో ఉష్ణోగ్రతను నియంత్రించే కేంద్రం దెబ్బతినడం మూలంగా వడదెబ్బకు గురవుతారు. వడదెబ్బ సోకిన వ్యక్తి శరీర ఉష్ణోగ్రత 108 నుంచి 110 డిగ్రీల ఫారన్ హీట్‌కు పెరుగుతుంది. నిర్లక్ష్యం వహిస్తే ప్రాణాలకే ముప్పు అని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఎండ వేడిమి అధికంగా సోకినప్పుడు తలనొప్పి, తల తిరగడం, చర్మం ఎండిపోవడం, తీవ్ర జ్వరం, మగత, కలవరింతలు, ఫిట్స్, పాక్షికంగా లేదా పూర్తిగా అపస్మారక స్థితికి వెళ్లడం జరుగుతోందని వైద్యులు అంటున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే వెంటనే వైద్యులను సంప్రదించాలని సూచిస్తున్నారు వైద్యులు. అదేవిధంగా నాలుగైదుమార్లు విరేచనాలైనా నిర్లక్ష్యం చేయొద్దంటున్నారు. ఎండలో తిరగాల్సిన అవసరం ఏర్పడితే ఉప్పు కలిగిన మజ్జిగ లేదా కాస్త ఉప్పు కలిగిన పళ్ల రసాలు తాగాలి. తెల్లని దుస్తులు ధరించేందుకే ప్రాధాన్యత ఇవ్వాలి. వేసవిలో మద్యం ఎక్కువగా సేవించడం వల్ల రక్తనాళాలు వ్యాకోచించి ఎక్కువ చమట పడుతుంది. విషమ పరిస్థితికి దారితీసే అవకాశం ఉందని వైద్యులు హెచ్చరిస్తున్నారు.



రద్దీ లేని రైల్వేస్టేషన్ రోడ్డు

జాగ్రత్తలు పాటించాలి



వేసవిలో ప్రతిఒక్కరూ జాగ్రత్తలు పాటించాలి. ద్రవ పదార్థాలు ఎక్కువగా తీసుకోవాలి. గాలి తగిలే దుస్తులు వాడాలి. ప్రత్యేకించి పిల్లలు, వృద్ధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి. పిల్లల్లో రోగనిరోధక శక్తి తక్కువగా ఉంటుంది. ఏడు నెలల్లో పిల్లల్లో 90 శాతం నీరు, 10 శాతం కణజాలం మాత్రమే ఉంటుంది. గ్లూకోజ్ సోడియం శరీరంలో ఉన్నప్పుడే ఆరోగ్యంగా ఉండగలుగుతాం.

–డాక్టర్ మాధవకృష్ణ, అసిస్టెంట్ ప్రొఫెసర్, కర్నూలు ప్రభుత్వ వైద్యశాల

క్లుప్తంగా

డ్రోన్ వినియోగంతో ఖర్చు ఆదా



మాట్లాడుతున్న శాస్త్రవేత్త ధనలక్ష్మీ

బనగానపల్లెరూరల్ : వ్యవసాయంలో డ్రోన్ వినియోగంతో రైతులకు పెట్టుబడి ఖర్చు ఆదా అవుతుందని కృషి విజ్ఞాన కేంద్రం(కేవీకే) ప్రధాన సీనియర్ శాస్త్రవేత్త ధనలక్ష్మీ తెలిపారు. బుధవారం మండలంలోని యాగంటిపల్లె సమీపానున్న కేవీకేలో డ్రోన్ వినియోగంపై రైతులకు, విద్యార్థులకు సదస్సు నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ కేవీకేలోని అగ్రికల్చర్ డ్రోన్ ప్రాజెక్టులో భాగంగా ఇప్పటికే బనగానపల్లె, ఆళ్లగడ్డ, రుద్రవరం, నందికొట్కూరు మండలాల్లోని పలు గ్రామాల్లో సుమారు 1500 ఎకరాల్లో చిన్నసన్నకారు రైతుల పొలాల్లో డ్రోన్ల ద్వారా రసాయనిక మందులు పిచికారీ చేయించిఅవగాహన కల్పించామన్నారు. డ్రోన్ అవసరం ఉన్న రైతులు స్థానిక కేవీకేలో సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో కేవీకే ఏఓ సురేష్‌కుమార్, వ్యవసాయ శాస్త్రవేత్తలు రమణయ్య, బాలరాజు, కృష్ణమూర్తి, ఆదినారాయణ, రవిగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి సమస్య తలెత్తకూడదు

కొలిమిగుండ్ల: వేసవి ప్రారంభం కావడంతో గ్రామాల్లో తాగునీటి సమస్య తలెత్తకుండా చూసుకోవాలని ఎంపీడీఓ సుబ్బరాజు కార్యదర్శులకు సూచించారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయలంలో పంచాయితీ కార్యదర్శులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సచివాలయ సిబ్బంది బయోమెట్రిక్ హాజరు వేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. బెలుం, అంకిరెడ్డిపల్లెలో ఖాళీగా ఉన్న వార్డు మెంబర్లతో పాటు కనకాద్రిపల్లె సర్పంచ్, తుమ్మలపెంట ఎంపీటీసీ స్థానానికి సంబంధించి ఎలక్ట్రోల్ తయారు చేయాలని సూచించారు. అదేవిధంగా ఆయుష్మాన్ భారత్ రిజిస్ట్రేషన్లు, సుస్థిర అభివృద్ధి లక్ష్యాలు తదితర అంశాలపై గురించి చర్చించారు.

హోరా హోరీగా బండ లాగుడు పోటీలు

డోన్ టౌన్: పట్టణ సమీపంలో వెలసిన శ్రీరామచంద్రమాలిక్ బాబా సంస్థాన్ ఆధ్వర్యంలో బుధవారం నిర్వహించిన బండలాగుడు(రాతి దూలం)పోటీలు హోరాహోరీగా సాగాయి. కొత్తకొట గ్రామానికి చెందిన గురునాథ్ వృషభాలు ప్రథమ స్థానం, ద్వితీయ స్థానంలో ప్యాపిలి మండలం పిఆర్ పల్లె గ్రామానికి చెందిన మంగళి నాగయ్య వృషభాలు, తృతీయ స్థానంలో కొత్తకొట రామ్మోహన్ వృషభాలు నిలిచాయి. నాల్గవ స్థానంలో అనంతపురం జిల్లా గార్లదిన్నెకు చెందిన రామాంజనేయులకు చెందిన వృషభాలు, ఐదవ, ఆరవ స్థానాల్లో ప్యాపిలి మండలం కిష్టాపురానికి చెందిన గోసి నాగరాజు, నాగేశ్వరరెడ్డి వృషభాలు నిలిచాయి. వీటి యజమానులకు మాలిక్‌బాబా సంస్థాన్ నిర్వాహకులు దాతల ఆర్థిక సాయంతో వరుసగా రూ.50 వేలు, రూ. 40వేలు, రూ. 30వేలు, రూ.,25వేలు, రూ.20వేలు, రూ.10వేల చొప్పున అందజేశారు.

స్వాతంత్ర్య సమర యోధుల ఆశయాలు నెరవేర్చాలి

డోన్ టౌన్: స్వాతంత్ర్యం కోసం ప్రాణ త్యాగాలు చేసిన స్వాతంత్ర్య సమర యోధుల ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని హెచ్ఎం గంగిరెడ్డి, సామాజిక కార్యకర్త మహమ్మద్ రఫీలు అన్నారు. తొలి విద్యాశాఖ మంత్రి మౌలానా అబుల్ కలాం ఆజాద్, స్వాతంత్ర సమరయోధుడు ఉయ్యాలవాడ నరసింహారెడ్డి వర్ధంతిలను పురస్కరించుకొని కొత్తపేటలోని లోకల్ ఫండ్ ప్రభుత్వ పాఠశాల్లో వారి చిత్ర పటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. మౌలానా అబుల్ కలాం ఆజాద్, ఉయ్యాలవాడ నరసింహారెడ్డి త్యాగాలను వారు గుర్తు చేశారు.

దాడులు చేసిన వారిని కఠినంగా శిక్షించాలి

బేతంచెర్ల: దళితులపై దాడులు చేసిన వారిని వెంటనే అరెస్టు చేసి కఠినంగా శిక్షించాలని ఎమ్మార్పీఎస్ రాష్ట్ర కార్యదర్శి తాలుక రాజయ్య డిమాండ్ చేశారు. బుధవారం పట్టణంలో ఎమ్మార్పీఎస్ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్యాపిలి మండలం జక్కసాని కుంట్ల గ్రామంలో ఎస్సీ కుటుంబానికి చెందిన గౌరిగాళ్ల నాగరవి, రామాంజనేయులు, నాగరాజు, వెంకటమ్మ, భాస్కర్ కుటుంబాలపై దాడి చేసి కులం పేరుతో దూషించిన వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలన్నారు. ఈనెల 16వ తేదీ రాత్రి పెళ్లి ఉత్సవాల్లో భాగంగా ఊరేగింపుగా చేస్తుండగా అగ్రవర్ణాలు దాడులకు పాల్పడడం సమంజసం కాదన్నారు. సమావేశంలో నాయకులు నిమ్మకాయల శేఖర్, మధు, బాల మద్దయ్య, ఎర్రన్న, సురేష్, బాల కృష్ణయ్య తదితరులు పాల్గొన్నారు.

సగటు వేతనం పడేలా పనులు చేయాలి

బేతంచెర్ల: మండలంలోని ఉపాధి కూలీలు సగటు వేతనం పడేలా సమయపాలన పాటించి పనులు చేయాలని ఏపీఓ శేషన్న తెలిపారు. మండల పరిధిలోని రహిమానుపురం, ఆర్ఎస్ రంగాపురం గ్రామాల్లో ఉపాధి కూలీలు చేస్తున్న కుంటలో పూడికతీత పనులను బుధవారం ఆయన పరిశీలించారు. ఉదయం 6గంటల నుంచి 11 గంటల వరకు రూ.257 వేతనం పడేలా పని చేయాలన్నారు. కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ శివకుమార్, ఫీల్డ్ అసిస్టెంట్ మోహన్ పాల్గొన్నారు.

నేడు సంజామల మండల మీట్

కోవెలకుంట్ల: సంజామల మండల పరిషత్ కార్యాలయంలో గురువారం మండల సర్వసభ్య సమావేశం ఏర్పాటు చేసినట్లు ఎంపీడీఓ విజయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. బుధవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన జరిగే సర్వసభ్య సమావేశంలో విద్య, వైద్యం, గ్రామీణ నీటి సరఫరా, విద్యుత్, వ్యవసాయ, పశుపోషణ, గ్రామీణ గృహ నిర్మాణం, మాతా, శిశు సంరక్షణ, రెవెన్యూ, వైఎస్సార్ క్రాంతిపథం, పంచాయతీరాజ్, ఆర్అండ్‌బీ తదితర శాఖలపై చర్చ కొనసాగుతుందన్నారు. జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, ఆయా శాఖల అధికారులు విధిగా హాజరు కావాలని సూచించారు.

ఓపెన్ ఇంటర్‌కు దరఖాస్తు చేసుకోండి

ప్యాపిలి: ఓపెన్ ఇంటర్‌కు ఆసక్తి ఉన్న అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవాలని స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యం బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. పదో తరగతి పాసై ఇంటర్ చదువుకోలేకపోయిన విద్యార్థులు, ఇంటర్ మధ్యలో ఆపేసినవారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ నెల 27 వ తేదీలోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనంతరం తమ విద్యార్హత ధృవీకరణ పత్రాలతో స్థానిక కళాశాలలో సంప్రదించాలన్నారు.

వైభవంగా మాలిక్‌బాబా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న దృశ్యం



పూజలు నిర్వహిస్తున్న న్యాయమూర్తి తంగమణి

డోన్ టౌన్: పట్టణ సమీవపంలో వెలసిన శ్రీరామచంద్ర మాలిక్ బాబా రథోత్సవం అంగరంగ వైభవంగా సాగింది. మాలిక్‌బాబా 33వ ఆరాధనోత్సవాల్లో భాగంగా ఈనెల 18న ప్రారంభమైన ఉత్సవాల్లో భాగంగా బుధవారం మాలిక్‌బాబా పుణ్యతిథిని పురష్కరించుకొని రథోత్సవం నిర్వహించారు. కేరళ కళాకారులతో అద్భుత వాయిద్యాలు, శివ భక్తులు, గోరవయ్యల నృత్యాలు మధ్య బాబా రథత్సోవం అంగరంగ వైభవంగా జరిగింది. రథోత్సవాన్ని తిలకించడానికి భక్తులు పెద్దఎత్తున తరలిరావడంతో ఆ ప్రాంతం కిటకిటలాడింది.

ఆధ్యాత్మిక తత్వాన్ని అలవర్చుకోవాలి

ప్రతి ఒక్కరూ ఆధ్యాత్మికతను అలవర్చుకోవాలని సీనియర్ సివిల్ జడ్జి తంగమణి సూచించారు. బుధవారం బాబా సంస్థాన్‌లో ఆమె ప్రత్యేక పూజలు నిర్వహించారు. షిర్డీ సాయిబాబా, రామచంద్రమాలిక్‌బాబా లాంటి ఎందరో గురువులు తోటివారిని ప్రేమించాలని హితబోధ చేసి ప్రజల్లో దేవుడిగా నిలిచి పోయారన్నారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి, మాలిక్ బాబా సంస్థాన్ లీగల్ అడ్వయిజర్ నరసింహులు, కమిటీ గౌరవ అధ్యక్షుడు మర్రి మునికృష్ణయ్య, అధ్యక్షుడు గురుప్రసాద్, కోశాధికారి రాజు, సభ్యులు లక్ష్మీనారాయణ, శివ, చలపతి, వెంకటేశ్వర్లు, కాశీరావ్, రామకృష్ణ పాల్గొన్నారు.

ప్యాడ్,పెన్నుల పంపిణీ

బనగానపల్లె: స్థానిక బీసీ బాలికల వసతి గృహంలో పదవ తరగతి విద్యార్థినులకు ప్యాడ్, రెండు పెన్నులు మాజీ రాజ్యసభ సభ్యులు టీజీ వెంకటేష్ వివాహ దినోత్సవం సందర్భంగా ప్రపంచ ఆర్య వైశ్య మహాసభ నంద్యాల జిల్లా అధ్యక్షులు టంగుటూరీ శీన య్య ఆధ్వర్యంలో బుధవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో వార్డెన్ చైతన్యలక్ష్మీ, ఆర్య వైశ్య సంఘం పట్టణ అధ్యక్షులు శివచంద్రయ్య, నాయకులు నాగేంద్ర, భరతుడు,హనుమాన్, నల్లగట్ల వెంకటేశ్వర్లు, నల్లగట్ల శివయ్య పాల్గొన్నారు.

క్రైం కార్నర్

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

కొలిమిగుండ్ల: మండల పరిధిలోని అంకిరెడ్డిపల్లె సమీపంలో బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు గాయపడ్డారు. కొలిమిగుండ్లకు చెందిన ప్రతాప్, అంజలి దంపతులు బైక్‌పై తాడిపత్రికి బయలు దేరారు. మార్గమధ్యలో అంకిరెడ్డిపల్లె సమీపంలో ట్రాక్టర్ ఢీకొనడంతో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. 108 వాహనంలో క్షతగాత్రులను తాడిపత్రి ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకెళ్లారు. అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కుటుంబ సభ్యులు అనంతపురంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు.

చర్చి ఫాదర్‌కి గాయాలు

అవుకు: పట్టణ సమీపంలోని సాయిబాబా ఆలయం వద్ద బుధవారం రాత్రి రెండు మోటర్ సైకిళ్లు ఎదురెదురుగా ఢీకొని చర్చి ఫాదర్ పల్లె ప్రకాశంకు గాయాలయ్యాయి. మండల పరిధిలోని చెన్నంపల్లె గ్రామానికి చెందిన పల్లె ప్రకాశం గుడ్‌ఫ్రైడే ప్రారంభమవుతున్న నేపథ్యంలో అవుకు పట్టణంలోని చర్చిలో ప్రార్థనలు ముగించుకొని రామాపురంలో ప్రార్థనలు చేయటానికి మోటార్ సైకిల్‌పై వెళ్తున్నాడు. మార్గ మధ్యలో సాయిబాబా ఆలయం వద్ద ఎదురుగా వస్తున్న మరో గుర్తు తెలియని వ్యక్తి మోటర్ సైకిల్‌తో ఢీ కొట్టి వెళ్లిపోయాడు. స్థానికులు పల్లె ప్రకాశంను ఆటోలో ఆసుపత్రికి తరలించారు.

లారీ ఢీకొని యువకుడు మృతి

అవుకు: అవుకు పట్టణంలోని బస్టాండ్ సమీపంలో మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రగాయాలకు గురైన యువకుడు మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణంలోని ఎస్సీ కాలనీకి చెందిన మందా బాలరాజు జయమ్మ రెండవ సంతానం మందా బాబు(22). ఇతను మంగళవారం రాత్రి తేరువీధి నుంచి బస్టాండ్ వైపుకు మోటార్ సైకిల్‌పై వస్తున్నాడు. అదే సమయంలోనే బనగానపల్లె వైపు నుంచి అతివేగంగా వచ్చిన లారీ ట్రక్కు బస్టాండ్ వద్ద మలుపు వద్ద బైక్‌ను ఢీ కొట్టింది. దీంతో మందా బాబు కిందపడి తలకు, రెండు చేతులకు బలమైన గాయాలు అయ్యాయి. వెంటనే చికిత్స నిమిత్తం బనగానపల్లె ఆసుపత్రికి, అక్కడి నుంచి మెరుగైన చికిత్స కోసం కర్నూలు ఆసుపత్రికి తరలించారు. కర్నూలులో చికిత్స పొందుతూ కోలుకోలేక బుధవార మృతి చెందాడు. మృతుని తల్లి మందా జయమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్ఐ జగదీశ్వర్ రెడ్డి తెలిపారు.

కోలుకోలేక వలంటీర్..

బేతంచెర్ల: మండల పరిధిలోని సిమెంట్ నగర్ గ్రామానికి చెందిన మండ్ల వెంకట సుబ్బయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు సురేంద్ర వలంటీర్ గా పని చేస్తున్నాడు. మూడు రోజుల క్రితం సురేంద్ర(21) పాముకాటుకు గురికావడంతో చికిత్స నిమిత్తం కర్నూలుకు తరలించగా కోలుకోలేక మృతి చెందాడు. వైఎస్సార్‌సీపీ మండల నాయకుడు బాబుల్‌రెడ్డి, గ్రామ నాయకుడు మహేష్ వలంటీర్ సురేంద్ర కుటుంబ సభ్యులను బుధవారం పరామర్శించారు.

బీసీలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం

- సామాజిక న్యాయమే సీఎం లక్ష్యం
- బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల రాజకీయాభివృద్ధికి ప్రోత్సాహం
- ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

బనగానపల్లె : సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పాలనలో బీసీలకు అన్నిరంగాల్లో సముచిత స్థానం కల్పిస్తున్నారని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తెలిపారు. అదేవిధంగా ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు ప్రాధాన్యతనిస్తూ ప్రోత్సహిస్తున్నారని, త్వరలో జరగబోయే 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 14 స్థానాలను బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీలకు కేటాయించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌కు దక్కిందన్నారు. పట్టణంలోని తన స్వగృహం వద్ద ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎమ్మెల్యే కాటసాని మాట్లాడారు. ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపులో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు సీఎం సముచిత స్థానం కల్పించారని ఎమ్మెల్యే కాటసాని అభినందనలు తెలిపారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా బడుగుల అభివృద్ధికి సీఎం అంకితభావంతో కృషి చేస్తున్నారని, గతంలో ఐదు డిప్యూటీ సీఎంలు ఉండగా నాలుగు బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ అభ్యర్థులకే కేటాయించారని గుర్తు చేశారు. స్పీకర్ స్థానాన్ని బీసీకి, డిప్యూటీ స్పీకర్ స్థానాన్ని మైనార్టీలకు, శాసన మండలి చైర్మన్ పదవిని ఎస్సీలకు కేటాయించిన విషయం తెలిసిందేనన్నారు. అదేవిధంగా 13 జెడ్పీ చైర్మన్లలలోనూ 9 మంది రిజర్వేషన్ కల్పించినవారే ఉన్నారన్నారు. 87 మంది మున్సిపాల్ చైర్మన్లు ఉండగా 84 మంది వైఎస్సార్‌సీపీ అభ్యర్థులు గెలుపుపొందగా ఇందులో 73 శాతం బీసీ, ఎస్సీ, ఎస్టీ మైనార్టీ వారే ఉన్నారన్నారు. 648 మండలాల్లో 637 మంది వైఎస్సార్‌సీపీ వారే ఎంపీపీ పదవులను దక్కించుకోగా ఇందులో 431 మంది రిజర్వేషన్ అభ్యర్థులే అని కాటసాని వివరించారు. 137 కార్పొరేషన్లలో 58 శాతం ఈ వర్గాలకే లభించగా డైరెక్టర్ల పదవులు కూడా ఎక్కువ శాతం వీరికే లభించాయన్నారు. 56 బీసీ కార్పొరేషన్ల ఉండగా ఇందులో 646 మంది డైరెక్టర్లు పదవులు ఈ వర్గాలకు చెందినవారికే లభించాయన్నారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలకు అత్యధికంగా రాజకీయ ప్రాధాన్యనిచ్చిన ఏకైక ముఖ్యమంత్రి సీఎం వైఎస్ జగన్ అని పేర్కొన్నారు. ఉద్యోగ, ఉపాధి రంగాల్లోనూ ఈ వర్గాలకు సీఎం అత్యధిక ప్రాధాన్యతనిస్తున్నారని ఎమ్మెల్యే వివరించారు.

టీడీపీ పాలనలో చేసిందేమీ లేదు....

గత టీడీపీ పాలనలో బీసీ, ఎస్సీ,ఎస్టీ మైనార్టీ వర్గాల వారికి చేసింది ఏమిలేదని ఎమ్మెల్యే కాటసాని అన్నారు. స్వార్థ రాజకీయాల కోసం జన్మభూమి కమిటీలను నియమించి పేదలను పీడించారని విమర్శించారు. ఇష్టారాజ్యంగా అభివృద్ధి పనులు దక్కించుకుని సొమ్ము చేసుకోవడం తప్పా ప్రజలకు ఏమి చేశారని నిలదీశారు. సామాజిక న్యాయమే లక్ష్యంగా సీఎం ముందుకు సాగుతున్నారని, అన్ని సామాజిక వర్గాలకు అండగా నిలుస్తున్నారన్నారు. 2024 ఎన్నికల్లో సీఎం వైఎస్ జగన్ మరోమారు మంచి మెజారీతో గెలిపించుకొవాలని ఎమ్మెల్యే కాటసాని ప్రజలకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు పీఆర్ వెంకటేశ్వరరెడ్డి, మాధవరెడ్డి, రామసుబ్బారెడ్డి, జిల్లెల్ల శంకర్‌రెడ్డి సిద్దంరెడ్డి రామ్మోహన్‌రెడ్డి, చిన్నకొప్పెర్ల మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయండి

- ఎంపీపీ చల్లా రాజశేఖర్‌రెడ్డి



అవుకు: అవుకు పట్టణంలో నూతనంగా వేసిన ప్రధాన రహదారిపై స్పీడు బ్రేకర్లు వేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఎంపీపీ చల్లా రాజశేఖర్ రెడ్డి సంబంధిత అధికారులకు సూచించారు. స్థానిక బస్టాండ్ సమీపాన మలుపు వద్ద మంగళవారం రాత్రి రోడ్డు ప్రమాదానికి గురైన వ్యక్తి మృతి చెందడంతో ఆర్అండ్‌బీ అధికారుల తీరుపై అసహనం వ్యక్తం చేశారు. బుధవారం ఘటన ప్రాంతాన్ని పరిశీలించిన అనంతరం తన కార్యాలయంలో సంబంధిత అధికారులతో ఫోన్ మాట్లాడారు. ప్రధాన రహదారి రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా మున్నా మార్కెట్ వద్ద ఉన్న ఎస్సీ కాలనీ నుంచి తేరువీధి అవతలి వరకు రెండు దఫాలుగా పనులు పూర్తయ్యాయని, అయితే మలుపుల వద్ద స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేయకపోవడం ఏమిటని ప్రశ్నించారు. ఈ రోడ్డులో రెండు ప్రమాదకర మలుపులు, మూడు కూడళ్లు ఉన్నాయని, స్పీడ్ బ్రేకర్లు లేనందున నిత్యం ప్రమాదాలు జరుగుతున్నా పట్టించుకోరా అని అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రత్యేకించి బస్టాండ్ వద్ద ఉన్న మలుపు అత్యంత ప్రమాదకరంగా ఉందని, ఈ కూడలి సమీపాన మెట్టుపల్లె రహదారిలో ఆదర్శ పాఠశాల, కస్తూర్బా, మదర్ మోడల్ స్కూల్స్ ఉన్న విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. వెంటనే స్పీడ్ బ్రేకర్లు ఏర్పాటు చేసి ప్రమాదాలకు అడ్డుకట్ట వేయాలని ఈ సందర్భంగా ఎంపీపీ చల్లా ఆదేశించారు.

తెల్లదొరల పాలిట సింహ స్వప్నం నరసింహారెడ్డి



నరసింహారెడ్డి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: భారత దేశానికి స్వాతంత్ర్యం సిద్ధం పజేసేందుకు పోరాటం చేసిన ఉయ్యాలవాడ నరసింహారెడ్డి తెల్ల దొరల పాలిట సింహస్వప్నంగా నిలిచారని వక్తలు పేర్కొన్నారు. బుధవారం నరసింహారెడ్డి 176వ వర్ధంతిని పురస్కరించుకొని పట్టణంలో ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే స్థానిక వాసవీ బొమ్మిడాల ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నరసింహారెడ్డి వర్ధంతి నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో రాయలసీమ జాయింట్ యాక్షన్ కమిటీ కో ఆర్డినేటర్ కామని వేణుగోపాల్‌రెడ్డి, అధ్యాపకులు రామసుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి మాట్లాడారు. స్వాతంత్ర్యోద్యమంలో నరసింహారెడ్డి కీలక పాత్ర పోషించారని గుర్తు చేసిన వారు ఆయన త్యాగాలను కొనియాడారు. కార్యక్రమంలో అధ్యాపకులు భాస్కరరెడ్డి, రాజు, రాజశేఖర్‌లు పాల్గొన్నారు.

ఎక్సైజ్ అధికారుల దాడులు

- అగ్రిఫ్యాక్టరీ, కల్లు దుకాణాల తనిఖీ



కల్లును పరీక్షిస్తున్న అధికారులు

డోన్ టౌన్: మండల పరిధిలోని ఉడుములపాడు గ్రామ సమీపంలో ఉన్న అగ్రిసోల్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ ఫ్యాక్టరీతో పాటు పట్టణంలోని కల్లు దుకాణాలపై బుధవారం నంద్యాల జిల్లా ప్రొహిబిషన్, ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది దాడులు నిర్వహించారు. విస్తృతంగా తనిఖీలు చేశారు. అగ్రిసోల్ ఫ్యాక్టరీలో మెథనాల్ నిల్వలు, వినియోగం, స్టాక్ రిజిష్టర్‌ను పరిశీలించారు. మెథనాల్ వినియోగంపై తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఎక్సైజ్ అధికారి రవికుమార్‌రెడ్డి ఆదేశించారు. అలాగే పట్టణంలోని కర్నూలు, నంద్యాల రైల్వే గేట్లు, తారకరామనగర్, కంభాలపాడు క్రాస్‌రోడ్డు, యూనియన్ క్లబ్ వెనుక, అమ్మ హోటల్ తదితర ప్రాంతాలలో ఉన్న కల్లు దుకాణాలను తనిఖీ చేశారు. కల్లు నాణ్యతను పరిశీలించి రసాయనిక పరీక్షల నిమిత్తం కల్లు శాంపిల్స్‌ను సేకరించామని ఆయన చెప్పారు. దాడుల్లో ఎక్సైజ్ ఎస్ఐ అస్లాం బేగ్, హెడ్ కానిస్టేబుల్స్ లక్ష్మీనారాయణ, శివనాగిరెడ్డి, కానిస్టేబుల్ కల్పన తదితరులు పాల్గొన్నారు.

అణగారిన వర్గాలను అందలం ఎక్కించిన జగనన్న

- చట్ట సభల్లోకి బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ వర్గాలు
- ఎమ్మెల్సీ స్థానాల కేటాయింపుపై వైఎస్సార్‌సీపీ నాయకుల హర్షం



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి

డోన్ : దేశంలోనే ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన వారిని చట్టసభల్లోకి అత్యధిక సంఖ్యలో పంపించిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందని ఎంపీపీ రేగటి రాజశేఖర్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ సప్తశైల రాజేష్, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ మల్లెంపల్లె రామచంద్రుడు పేర్కొన్నారు. మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి స్థానిక స్వగృహంలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. శాసనమండలికి 18 స్థానాలకు జరగనున్న ఎన్నికల్లో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి 11 స్థానాలు బీసీలు, ఇద్దరు ఎస్సీలు, ఒకరు ఎస్టీ, ఓసీలకు నాలుగు స్థానాలు కేటాయించి సమన్యా యం చేశారన్నారు. ఇంతవరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ నామినేటెడ్ పదవుల్లో 50 శాతం ఎస్సీ, ఎస్టీ, బిసి, మైనార్టీ వర్గాలకు చెందిన వారికి కేటాయించిన ఘనత కూడా సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు.

ఎన్‌టీఆర్ తర్వాత...

బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల్లో రాజకీయ చైతన్యాన్ని దివంగత ఎన్‌టి రామారావు నింపితే వారిని చట్టసభల్లోకి అత్యధిక శాతం పంపిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదే అన్నారు. సామాజిక న్యాయం సాధించేందుకు జననేత చేస్తున్న ప్రయత్నాలకు ప్రజలు అండగా నిలవాలని వారు ప్రజలకు పిలుపునిచ్చారు. అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వంలో ప్రాతినిథ్యం వహించాలని చట్టసభల్లో వారి గొంతు వినిపించే అవకాశం కల్పించాలని సీఎం జగన్‌మోహన్‌రెడ్డి పడుతున్న తపనను ప్రతిఒక్కరూ గమనించాలని కోరారు. వాల్మీకులకు రెండు ఎంఎల్‌సీ స్థానాలు కేటాయించడంపై ఆ సంఘం రాష్ట్ర కార్యదర్శి శీలం భాస్కర్‌నాయుడు, నాయకులు పోస్టుపసాద్ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలియజేశారు. సమావేశంలో మున్సిపల్ వైస్ చైర్మన్ జాకీర్‌హుసేన్, కౌన్సిలర్లు దినేష్‌గౌడ్, మహేశ్వరరెడ్డి, ఆర్ట్ రమణ, మౌలాలి, వెంకట్రాముడు, రైల్వే నాగేంద్ర, సుమలత సురేష్, వడ్డె రంగస్వామి, ఎల్ ఈశ్వర్, పందు, డంకేష్, ప్రతాప్‌రెడ్డి, మిట్టా రవి, సుంకన్న, వైఎస్సార్‌సీపీ నాయకులు ఎద్దుపెంట వెంకటేశ్వర్లు, లక్ష్మిరెడ్డి, డీలర్ క్రిష్ణ, బుర్రు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.